

ప్రజావాణిలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ

వికారాబాద్, ఏప్రిల్ 21 : ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 140 ఫిర్యాదులను సమర్పించారని.. వాటిలో భూ సమస్యలు, భూ సర్వే, గ్రామ పంచాయతీ, ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నవని పేర్కొన్నారు. భూ సమస్యలను పరిశీలించి, ఆన్‌లైన్ రికార్డులను చెక్‌చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్టు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అధికారులున్నారు.

### సమస్యల పరిష్కారానికి భూ భారతి

దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మోమిన్‌పేటలోని రైతువేదికలో భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు తమ భూముల విషయంలో అభద్రతా భావాని కి తావీయకుండా జవాబుదారీతనాన్ని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామాలు వంటి సేవలు సులభతరమవుతాయన్నారు. జూన్ 2 నుంచి నూతన చట్టం భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో జరిగిన మరమ్మతుల పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీవో విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, పీఏసీఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# భూభారతి చట్టాన్ని నిర్వీర్యం చేస్తే చర్యలు తప్పవు

- రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఇబ్రహీంపట్నంలో భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు



భూభారతి రెవెన్యూ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : భూభారతి చట్టాన్ని నిర్వీర్యం చేస్తే చర్యలు తప్పవని.. రెవెన్యూ అధికారులంతా రైతు కుటుంబంలో నుంచి వచ్చినవారు కాబట్టి రైతుకు మేలుచేసేలా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డిజిల్లా ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని భూభారతి 2025లో పొందుపరచామన్నారు. ఆధార్ కార్డు తరహాలో భూమి ఉన్న ప్రతి రైతుకూ భూ ఆధార్‌కార్డును అందిస్తామన్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ మాసంలో జమాబందీ మాదిరిగా రెవెన్యూ రికార్డులను కంప్యూటర్‌లో పొందుపర్చి జిరాక్స్ పత్రాలను రెవెన్యూ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల పనితీరును మెరుగుపర్చేందుకు తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో కంప్లైంట్ బాక్సులను ఏర్పాటు చేస్తామని, రైతులు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు వారి పనితీరుపై పేపర్‌పై రాసి బాక్సులు వేయాలని ఆయన రైతులు, ప్రజలకు తెలిపారు.

### భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం

గత కొన్ని నెలులగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను 2025 భూభారతి చట్టం ద్వారా పరిష్కరించబడుతాయని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేందుకు అవకాశం లేకుండా ఈ చట్టం ద్వారా గ్రామ స్థాయి, మండలస్థాయి, డివిజన్‌స్థాయిలోనే పరిష్కరించబడతాయని తెలిపారు. భూభారతి చట్టంలో ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రైతులు అర్థం చేసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు ఈ చట్టాన్ని పకడ్బందీగా గ్రామాల్లో అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

కార్యక్రమంలో భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ మహిపాల్, సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

ఆదిబట్ల, ఏప్రిల్ 21 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 68 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా అధికారులు తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారని అధికారులు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ నుంచి 27, ఇతర శాఖల నుంచి 41 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.



**పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైళ్లను పరిశీలించి పోలీసుల పనితీరు మెరుగ్గా ఉందని.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషిచేయాలని తెలిపారు. పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. – ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21

## దూరవిద్య పీజీ కోర్సుల పరీక్ష తేదీలు ఖరారు

**ఉస్మానియా యూనివర్సిటీ :** ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్ సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన సూచించారు.

## ఎంపీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

**ఉస్మానియా యూనివర్సిటీ :** ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్ లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 26వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవాలని ఆయన సూచించారు.

# వడగండ్ల వానతో అతలాకుతలం

- విరిగిపడిన భారీ వృక్షాలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నిలిచిపోయిన కరెంట్ సరఫరా
- పరిస్థితిని చక్కదిద్దిన సంబంధిత అధికారులు
- పాక్షికంగా పంటలకు నష్టం
- తడిసి ముద్దయిన ధాన్యం
- నేలరాలిన మామిడికాయలు
- పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో స్వల్పంగా పంటలకు నష్టం వాటిల్లింది. పొలాలు, ఇండ్ల వద్ద ఆరబోయిన ధాన్యం తడిసి ముద్దయింది ఇవ్వకపోవడంతో పిడుగుపాటుకు రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి. పలు చోట్ల భారీవృక్షాలు విరిగిపడగా.. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొంతసేపు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. పోలీసు సిబ్బంది జేసీబీ సహాయంతో చెట్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



చేవెళ్లరూరల్ : ఆలూర్, చిట్టంపల్లి గేట్ పరిధి బీజాపూర్ హైవేపై విరిగిపడ్డ మర్రి వృక్షం

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 21 : చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాల్లో భారీగా వడగండ్లు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆలూర్, చిట్టంపల్లి గేట్ పరిధి బీజాపూర్ ప్రధాన రహదారిపై మర్రి వృక్షం విరిగిపడింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు, పోలీసులు చాలా సేపు శ్రమించి మర్రి వృక్షాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పలు చోట్ల మామిడికాయలు నేలరాలాయి.



పరిగి : పిడుగుపాటుకు చనిపోయిన గేదె



కేశంపేటలో విరిగిపడిన చెట్టును జేసీబీ సహాయంతో తొలగిస్తున్న పోలీసులు



పరిగి : తహసీల్దార్ కార్యాలయం స్లాబ్ నుంచి లీకేజీ అవుతున్న నీరు

### పరిగి నియోజకవర్గంలో..

**పరిగి :** పరిగి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం గంటపాటు కురిసింది. దీంతో చేతికి వచ్చిన వరి పంట పాక్షికంగా దెబ్బతిన్నది. పిడుగుపాటుతో పరిగి సమీపంలోని తుంకులగడ్డ వద్ద గంగనోళ్ల శ్రీనివాస్‌కు చెందిన గేదె, రంగంపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో గొల్ల మల్లేశ్‌కు చెందిన గేదె చనిపోయాయి. ప్రభుత్వం ఆదుకొని తమకు పరిహారం అందించాలని పాడి రైతులు కోరుతున్నారు. పరిగిలోని తహసీల్దార్ కార్యాలయం స్లాబ్ నుంచి వర్షపు నీరు లీకయ్యింది. సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణానికి నిధులివ్వాలని స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరగా నిధుల మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారు.



కేశంపేటలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



దోమ : దిర్సంపల్లిలో నేలరాలిన మామిడికాయలను చూపిస్తున్న రైతు

### కేశంపేటలో 10మి.మీ వర్షపాతం నమోదు

**కేశంపేట :** కేశంపేట మండలంలో భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. వర్షపాతం 10మి.మీగా నమోదయింది. కేశంపేటతోపాటు మండలంలోని లేమామిడి, వేముల్‌నర్వ, కొత్తపేట, అల్వాల, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల తదితర గ్రామాల్లో పెద్దపెద్ద చెట్లు విరిగిపడగా.. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కేశంపేటలోని మైసమ్మతల్లి ఆలయం సమీపంలోగల ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ వృక్షం విరిగిపడగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన పోలీసు సిబ్బంది సీఐ నరహరి పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో విరిగిపడిన చెట్టును తొలగించారు. అదే ప్రాంతంలో విద్యుత్ స్తంభం సైతం నేలకొరిగింది.

### ధారూరు మండలంలో..

**ధారూరు :** మండల పరిధిలోని నాగారం, కుమ్మరిపల్లి, గురుదోట్ల, మైలారం తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల చెట్లు విరిగాయి.

### దోమ మండలంలో..

**దోమ :** మండల పరిధిలో తీవ్ర ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో వరి నేలకు ఒరిగి, మామిడికాయలు రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాకొండ గ్రామంలో వారం రోజుల క్రితం వరి కొనుగోలు కేంద్రాన్ని నామమాత్రంగా ఏర్పాటు చేశారు. రైతులకు గన్నీ బస్తాలను ఇవ్వకపోవడంతో పొలాల వద్ద, ఇంటి వద్దనే ధాన్యాన్ని ఆరబోశారు. సోమవారం భారీ వర్షం కురువడంతో ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది. దోమ నుంచి పాలేపల్లికి వెళ్లే బీటీ రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయినపూర్ గ్రామంలో అంజిలమ్మ, మైబయ్య ఇండ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. ప్రభుత్వం అదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



నవాబుపేట : మండల పరిధిలోని మహ్మదాన్‌పల్లి గ్రామ సమీపంలో గల రైలు పట్టాలపై గాలివానకు విరిగిపడిన చెట్లు, చుట్టుపక్కల రైతులు అప్రమత్తమై రైల్వే అధికారులకు సమాచారంతో ఇవ్వడంతో తప్పిన పెను ప్రమాదం



వికారాబాద్ : కొత్తగడి సమీపంలో ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా పడ్డ భారీ వృక్షం



పోలేపల్లిలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న అర్జున్‌రావు

# రజతోత్సవ సభకు పెద్దఎత్తున తరలిరావాలి

**బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు**

ఆమనగల్లు, ఏప్రిల్ 21 : తెలంగాణ సాధనే ధ్యేయంగా ఆవిర్భవించిన బీఆర్‌ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మండలం నుంచి పెద్దఎత్తున జనం తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆయా గ్రామాల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జల నీరు , నిధులు, నియమాకాల్లో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా 25 ఏండ్ల క్రితం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించిందన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలో ఎన్నో అలుపెరుగని పోరాటాలు చేసి అప్పటి కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. దేశంలో రైతులను అదుకుని రైతును రాజుగా చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని తండాల్లో మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ స్థానిక నాయకులతో కలిసి రజతోత్సవ సభకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను అవిష్కరించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీలు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్ డోల్యానాయక్, పార్టీ ఉపాధ్యక్షుడు పరమేశ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### నాగిళ్లలో..

**మాడ్గుల :** మండలంలోని నాగిళ్ల గ్రామంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్ ఆధ్వర్యంలో రజతోత్సవ సభకు సంబంధించి వాల్ పోస్టర్‌ను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలసి సోమవారం విడుదల చేశారు. మండలంలోని 33 గ్రామాల నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున తరలిరావాలని కోరారు.



నాగిళ్లలో వరంగల్ సభ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

# నిబంధనలకు నీళ్లు

**అర్బన్ బయోడైవర్సిటీలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం**

**కమిషనర్‌ను తప్పుదోవ పట్టించిన యూబీడీ**

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో నిబంధనలకు తిలోదకాలిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. అర్బన్ బయోడైవర్సిటీ విభాగంలో ఫీల్డ్ అసిస్టెంట్లు (సూపర్‌వైజర్స్) 39 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు (సూపర్‌వైజర్స్) 18 మంది కలిపి మొత్తం 57 మంది భర్తీకి టెండర్ పిలిచారు. ఒక్కొక్కరి నెలవారి వేతనం రూ.18,413లు ఉండగా.. నెలకు అలవెన్స్ రూ.1000 అదనంగా ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్టాండింగ్ కమిటీలో ఈ అంశాన్ని పెట్టి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరిగింది.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏ ఉద్యోగి నియామకం జరపాలన్న ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేసింది. కానీ ఘనత వహించిన అర్బన్ బయో డైవర్సిటీ విభాగం మాత్రం ఇవేమి పట్టలేదు.. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన ఏ విషయమైన స్టాండింగ్ కమిటీలో ఎజెండా అంశంగా పెట్టి చర్చించిన అనంతరం కమిషనర్‌కు ఆ తర్వాత అక్కడి నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఈ 57 మంది నియామకంలో కమిషనర్‌కే నేరుగా ఫైల్ పెట్టి ఆమోదం తీసుకున్న అర్బన్ బయోడైవర్సిటీ విభాగం వ్యవహారం ఉద్యోగుల్లో చర్చకు దారి తీసింది. టెండర్ పద్ధతిలోనే నియామకం జరిపినా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో కమిషనర్‌ను తప్పుదోవ పట్టించారన్న వాదనలు లేకపోలేదు. ప్రతి ఏటా తరహాలోనే ఫీల్ట్ అసిస్టెంట్ల నియామకం జరిగిందని బయో డైవర్సిటీ విభాగం చెబుతున్నది. ఈ విషయంలో అసలేం జరిగిందనే కోణంలో కమిషనర్ మరోసారి పునర్ సమీక్షించాలని పలువురు కోరుతున్నారు.